

ఏడీజీపీగా రూపా మౌద్గిల్‌కు పదోన్నతి

బెంగళూరు, మే 31(ఆంధ్రజ్యోతి): వివాదాలు వెంటాడుతున్నా ఐజీపీ అధికారిగా కొనసాగుతున్న డీ రూపామౌద్గిల్‌కు ఏడీజీపీగా పదోన్నతి దక్కింది. శనివారం రాష్ట్రప్రభుత్వం రూపామౌద్గిల్‌కు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఐఏఎస్ అధికారి రోహిణి సింధూరి తన వ్యక్తిగత ఫొటోలను బహిరంగం చేశారని ఐపీఎస్ రూపాపై చర్యలు తీసుకోవాలని పోరాటం కొనసాగిస్తున్నారు. ఇటీవల మార్చిలోనే తన క్యాబిన్‌లో ఫైళ్లు పెట్టి ఇబ్బంది కలిగించాలని ప్రయత్నించినట్లు రూపాపై మరో ఐపీఎస్ అధికారి వర్తికా కటియార్ ఫిర్యాదు చేశారు.


చిక్కోళి డ్యామ్



అన్నదాతకు.. హర్షమే..!


జోగ్ జలపాతం

125 ఏళ్లలో మే నెలలో అధిక వర్షపాతం

- వంద అడుగులతో కేఆర్ఎస్ కళకళ
- 80 ఏళ్లలో ఈ దశకు చేరుకుంది 4 సార్లే
- నిడుకుండలా జలాశయాలు
- సాగు రైతుల్లో ఆనందం
- రాష్ట్రంలో ఐదు జిల్లాల్లో కొనసాగుతున్న రెడ్ అలర్ట్

బెంగళూరు, మే 31(ఆంధ్రజ్యోతి): రెండేళ్లక్రిందట కరువుతో అతలాకుతలమైన రాష్ట్రప్రజలకు ఈఏడు ఊరటనిచ్చేలా నైరుతి రుతుపవనాలు ప్రారంభం కాకముందే విస్తారంగా వర్షాలు కురిశాయి. మే నెల ప్రారంభం నుంచే వర్షాలతో అన్నదాత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు మూడు నాలుగు నెలలపాటు వర్షాలు కురుస్తుండంతో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు నిండి పొంగిపొర్లాయి. దశాబ్దాల కాలంలో లేనంతగా ఈ ఏడాది మరింత ఉత్తమ వర్షాలు సాధ్యమవుతున్నాయి. నైరుతి రుతుపవనాలకు ముందే రాష్ట్రమంతటా నెలన్నరకాలంగా వరుణుడు కరుణ చూపుతున్నాడు. మరోవైపు తుఫాన్లు కలిసొచ్చాయి. కేవలం వారం రోజుల్లోనే అన్ని జలాశయాలు కళకళలాడే పరిస్థితి నెలకొంది. కావేరి నదికి అనుబంధమైన కొడగు జిల్లాతోపాటు పైభాగాన ఉండే కేరళలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కేరళకు ఇప్పటికే నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో మరింత ఆశాజనకం అనిపిస్తోంది. కొడగు జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి పూర్తిస్థాయిలో వర్షం కురిసింది. హారంగి జలాశయానికి ఇన్‌ఫ్లో 5వేల క్యూసెక్కులు దాటింది. శుక్రవారం నాటికి 7,200 క్యూసెక్కులకు పెరిగింది. హారంగి జలాశయం మే నెలలో దాదాపు నిండిపోయింది. గరిష్ట మట్టం 2,859 అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికే 2,846 అడుగులకు చేరింది. మరో 13 అడుగులు చేరితే డ్యామ్ నిండుకుండలా మారనుంది. కొడగు జిల్లా వ్యాప్తంగా 8-10 సెంటిమీటర్లు ఒక్కరోజులోనే వర్షం కురిసింది. ఇక కావేరి నదికి అనుబంధంగా ఉండే మరో జలాశయం కబిని కూడా దాదాపు నిండింది. 2284 అడుగులు గరిష్ఠం కాగా 2,280 అడుగులకు నీరు చేరింది. కావేరి నదికి అనుబంధమైన భారీ ప్రాజెక్టులు మండ్య జిల్లా శ్రీరంగపట్టణంలోని కృష్ణరాజసాగర్ (కేఆర్ఎస్) జలాశయం వంద అడుగులకు చేరింది.


హారంగి డ్యామ్

కృష్ణ రాజసం..!

కృష్ణరాజసాగర్ జలాశయం అంటే బెంగళూరు, మైసూరు, మండ్య నగరాలతోపాటు వేలాది గ్రామాలకు తాగునీటిని, మండ్యతోపాటు వివిధ ప్రాంతాల్లోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే మహత్తరమైన ప్రాజెక్టు. కేఆర్ఎస్ నిండితే బెంగళూరులోని కోటిన్నరమందికి తాగునీటి సమస్య ఉండదని సంతోషపడతారు. గడిచిన ఐదారేళ్లతో పోలిస్తే 2023 మినహా మిగిలిన సంవత్సరాల్లో సంతృప్తికరంగా నీరు చేరింది. 80ఏళ్ల చరిత్రలో మే నెలలో కేఆర్ఎస్ గరిష్ఠంగా 100 అడుగులు చేరింది కేవలం నాలుగుసార్లు మాత్రమే. 1954, 1961, 2022, 2025 సంవత్సరాల్లో మాత్రమే వంద అడుగులు సాధ్యమైంది. కేఆర్ఎస్‌కు 20వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో ఉంది. గరిష్ట నీటిమట్టం 124.80 అడుగులు కాగా 49.452 టీఎంసీల సామర్థ్యంగా ఉంది. ప్రస్తుతం 22.888 టీఎంసీల నీరు ఉంది. జలాశయం 90ఏళ్ల రికార్డును పరిశీలిస్తే 2024లో గరిష్ఠంగా 154 రోజులు ప్రాజెక్టు నిండుగా కొనసాగింది. మంగళవారం 4 అడుగుల నీరు చేరింది.


కేఆర్ఎస్ డ్యామ్

125 ఏళ్లలో మే నెలలో అత్యధిక వర్షం

రాష్ట్రంలో 125 ఏళ్ల చరిత్రలో మే నెలలోనే అత్యధిక వర్షం నమోదైంది. శుక్రవారం 10మందితో కలిపి ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 67మంది వర్షాల కారణంగా మృతి చెందారు. దక్షిణకన్నడ జిల్లాలోనే నిరంతరం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మార్చి నుంచి సాధారణంగా నైరుతి ముందస్తు వర్షాలుగా పరిగణిస్తారు. ఏప్రిల్‌లోనే రాష్ట్రమంతటా వాతావరణంలో మార్పు వచ్చింది. మైసూరు, కొడగు, మండ్య, హాసన్‌తోపాటు దక్షిణ జిల్లాలు, తీరప్రాంత జిల్లాల్లో నిరంతరం వర్షాలు కురుస్తున్నాయి. మే నెలలో ఎండలు ఎక్కువగా ఉన్నాయని సెలవులు ఇచ్చిన చరిత్ర ఉంది. కానీ దక్షిణకన్నడ జిల్లాలో మూడునాలుగు రోజులుగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇస్తూ వచ్చారు. రాష్ట్రంలో 5 జిల్లాల్లో రెడ్ అలర్ట్ కొనసాగుతోంది.


కబిని జలాశయం

పదేళ్లలో కేఆర్ఎస్ డ్యామ్ వంద అడుగులకు చేరిన వివరాలు

తేదీ	నీటిమట్టం
28 జూన్ 2015	101.25
28 జూలై 2016	99.65
4 సెప్టెంబరు	2017 100.10
17 జూన్ 2018	100.75
10 ఆగస్టు 2019	108.50
8 జులై 2020	100.33
21 జూలై 2021	100.76
11 మే 2022	100
25 జూలై 2023	100
5 జూలై 2024	100
30 మే 2025	100.10

15శాతం భూమి కుంగిపోయే ప్రమాదం..!

అధిక వర్షాలు రైతులకు మేలు చేస్తున్నా కొన్ని చోట్ల ప్రమాదాలు తప్పడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకించి తీరప్రాంతం, మలెనాడు ప్రదేశాలలో 15శాతం భూమి కుంగిపోయే ప్రమాదం ఉన్నట్టు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రాష్ట్రంలో భూమి కుంచించుకుపోయే సంఘటనలు శతాబ్దాలకాలంగా కొనసాగుతోంది. ఇటీవల కూడా ఈ పరిణామాలు కొనసాగిన విషయం తెలిసిందే. 2009 నుంచి ఇప్పటివరకు 1200కుపైగా భూమి కుంగిపోయిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. తద్వారా వందమందికి పైగా ప్రాణాలు కోల్పోగా వందలకోట్ల ఆస్తి నష్టం వాటిల్లింది. రాష్ట్రంలోని భూప్రదేశంలో 15.39 శాతం ప్రకారం 29వేల కిలోమీటర్ల భూవిస్తీర్ణం కుశించే ప్రమాదంలో ఉంది. ఇది 29 తాలూకాల పరిధిలో ఉంది. గడిచిన పదేళ్లలో అత్యధికంగా ఉత్తరకన్నడ జిల్లాలో భూమి కుంగిపోయింది. మిగిలిన జిల్లాలో ఉడుపి, దక్షిణకన్నడ, శివమొగ్గ, కొడగు, హాసన్ జిల్లాలు ఉన్నాయి. భూమి కుంగిపోయేందుకు పలు కారణాలు ఉన్నట్టు శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అధ్యయనం కోసం 3 ప్రత్యేకబృందాలు సర్వేలు చేశాయి. అటవీప్రాంతాలు, కొండగుట్టలను ఆక్రమించుకుని నిర్మాణాలు, అభివృద్ధి పనులు, జంగిల్ రిసార్టులు, రోడ్ల వెడల్పుకోసం తవ్వకాలు వంటి దాడులు నిరంతరంగా కొనసాగుతుండడంతో భూమి ఉనికిని కోల్పోయి కుశించికుపోయే సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. భూమి కుశించుకుపోయి జరిగిన ప్రమాదాలలో 2018-19లో 36మంది మృత్యువాత చెందగా 2020-21లో 12మంది, 2022-23లో 13మంది, 2024లో 13మంది మృతి చెందారు.


షుగర్ ఫ్యాక్టరీ ప్రాథమిక పాఠశాల

మందేసి.. ఉమ్మేసి..!

- మందుబాబులకు అడ్డాగా షుగర్ ఫ్యాక్టరీ పాఠశాల

కంప్లి, మే 31(ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణంలోని షుగర్ ఫ్యాక్టరీ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల రాత్రివేళ మద్య ప్రియులకు అడ్డాగా మారింది. నిత్యం రాత్రి 8 గంటలకు అనంతరం మందు తాగేసి ఎక్కడపడితే అక్కడ బాటిళ్లు పడేసి వెళ్తున్నారు. దీంతో పాటు గుట్కాలు నమిలేసి తరగతి గదుల్లో ఉమ్మేసి అధ్వానంగా తయారు చేస్తున్నారు. ఉదయం రాగానే విద్యార్థులు మద్యం బాటిళ్లను బయట పారేయాల్సిన దుస్థితి ఏర్పడింది. పాఠశాలకు ప్రహరీ లేకపోవడం, జులాయి వెదవలపై చర్యలు తీసుకోకపోవడంతోనే ఇలాంటి ఘటనలు అధికమయ్యాయని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా పోలీసులు రాత్రివేళల్లో పాఠశాలలో మందు తాగే వారిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.


తాగి పారేసిన బాటిళ్లు


ఖాళీ బాటిళ్లను తీసేస్తున్న విద్యార్థులు

అధిక వర్షాలతో అప్రమత్తం..!

- ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలి
- వానలపై సమీక్షలో సీఎం సిద్ధరామయ్య


ప్రసంగిస్తున్న సీఎం సిద్ధరామయ్య, పక్కన డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, మే 31(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమైందని జిల్లా అధికారులు, సీఈఓలు అప్రమత్తంగా వ్యవహరించి ఎక్కడా ప్రాణనష్టం లేకుండా చూడాలని సీఎం సిద్ధరామయ్య అధికారులకు సూచించారు. జిల్లా అధికారులు, జడ్పీ సీఈఓలతో సమీక్షా సమావేశం రెండోరోజు శనివారం నిర్వహించారు. విద్యాశాఖ సమీక్షలో ఎస్ఎల్ఎల్‌సీ ఫలితాలలో ఉత్తీర్ణత తగ్గేందుకు ఉపాధ్యాయుల కొరత సాకు చూపరాదని, 60శాతం తక్కువ ఫలితాలు వచ్చిన జిల్లాల డీడీపీఐలకు నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. వివరణ సమగ్రత లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు, మైనర్లు గర్భం దాల్చడం అనేది నియంత్రించాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. పౌష్టికాహార లోపం ఉన్న జిల్లాల్లో సమగ్రమైన విధానాలు పాటించాలని సూచించారు. జాతీయ రహదారుల ప్రాధికార భూస్వాధీన ప్రక్రియకు సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనర్హులైన బీపీఎల్ కార్డు లబ్ధిదారులను తొలగించేందుకు చొరవ చూపాలన్నారు. ఏ జిల్లాల్లో కూడా అనర్హులు ఉండరాదన్నారు. వ్యత్యాసం కొంతమేర సమంజసమని కానీ జిల్లాల్లో అత్యధిక మంది బీపీఎల్ కార్డులు కల్గినవారు శ్రీమంతులు ఉన్నారనే విమర్శలను పట్టించుకోరా? అన్నారు.

రెండురోజుల సమీక్షలు ముగిశాక సీఎం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ జిల్లా అధికారులు డైరీ రాయాలని, దాన్ని చీఫ్ సెక్రటరీకి పంపాలని సూచించామన్నారు. గొర్రెల పెంపకందారులకు తుపాకుల లైసెన్స్‌లు ఇవ్వాలని సూచించామన్నారు. అటవీశాఖ సిబ్బంది గొర్రెలకాపరులను వేధించరాదని హెచ్చరించామన్నారు. యువనిధి లబ్ధిదారులు, నిరుద్యోగులకు ఉద్యోగ నైపుణ్యత లభించేలాంటి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. ఉత్తర కర్ణాటకలో జింకల బెడదతో పంటలనష్టంపై చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. రాష్ట్రంలో 15,16,731 ఎకరాల అటవీప్రాంతం అభివృద్ధికి భూమి ఉందన్నారు. రెండేళ్లలో 8.5 కోట్ల మొక్కలు నాటామన్నారు. ఏనుగుల సంఘర్షణ విషయంలో చర్యలకు ఆదేశించామన్నారు. చిన్ననీటిపారుదలశాఖ ద్వారా చెరువులలో చేపలవేలం, ఈ- టెండరు ద్వారా నిర్వహించాలని సూచించామన్నారు. రాష్ట్రంలో 9 రైల్వేప్రాజెక్టులు ప్రగతిదశలో ఉన్నాయని, వాటికి అవసరమైన భూమిని గడువులోగా జిల్లాధికారులు సమకూర్చాలని సూచించామన్నారు. వివిధ జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, నియంత్రణకు బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించాలని సూచించామన్నారు. జిల్లా అధికారి, ఎస్పీలు కఠినంగా వ్యవహరిస్తే మైక్రో ఫైనాన్స్ వేధింపులు నియంత్రించవచ్చునన్నారు. అంబేడ్కర్ కార్మిక సహాయ హస్త పథకం కింద 91 అసంఘటిత కార్మికవర్గాలను గుర్తించి 25,61,105 మందికి గుర్తింపు ఇచ్చామన్నారు. ద్వేషపూరితమైన ప్రసంగాలు చేయరాదని సుప్రీంకోర్టు ఆదేశించినా ఎందుకు జిల్లాల వారీగా అటువంటి సందర్భాలను గుర్తించి సమీక్షించాలని సూచించామన్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాగా మధ్యాహ్నం సమీక్ష జరిగే సమయానికి డీసీఎంతోపాటు మంత్రులు లేకపోవడంతో సీఎం మండిపడ్డారు. సమీక్ష అంటే అందరూ పాల్గొనాలని ఎవరికివారుగా చర్చించుకోవడం సరికాదని సూచించారు.


హాజరైన సీఈఓలు, జిల్లా అధికారులు


బస్సును అడ్డుకుని ఆందోళన చేపట్టిన రైతులు

అన్నదాత ఆగ్రహం..!

- హేమావతి లింక్ కెనాల్‌కు వ్యతిరేకంగా నిరసన
- రహదారిపై బస్సును అడ్డుకుని ఆందోళన

బెంగళూరు, మే 31(ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ, తుమకూరు జిల్లాలో హేమావతి ఎక్స్‌ప్రెస్ లింక్ కెనాల్‌ను వ్యతిరేకిస్తూ రైతులు తీవ్ర నిరసన చేపట్టారు. బెంగళూరు-శివమొగ్గ జాతీయ రహదారిపై శనివారం బస్సును అడ్డుకుని నిరసన తెలిపారు. దీంతో నిరసనకు ముందే పెద్దసంఖ్యలో చేరుకున్న రైతులను కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు తుమకూరు రూరల్ ఎమ్మెల్యే బీ సురేశ్‌గౌడ, బీజేపీ ఎమ్మెల్యే జ్యోతిగణేశ్, బీజేపీ అధ్యక్షుడు రవిశంకర్‌లు నిరసనకు నేతృత్వం వహించారు. 40శాతం పనులు జరిగాయని ఈ కారణంగా ఆపే ప్రసక్తే లేదని డీసీఎం డీకే శివకుమార్ స్పష్టం చేశారు. తుమకూరులో రైతుల వ్యతిరేకతకు సంబంధించి విధానసౌధలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పరమేశ్వర్‌తో చర్చించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అక్కడ ఉన్నదీ, ఇక్కడ ఉన్నదీ రైతులేనన్నారు. అందరి సంక్షేమం కాపాడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యేలకు అవగాహన లేకపోవడం విచారకరమన్నారు. సాంకేతిక సమితి ఇచ్చిన నివేదిక ఆధారంగానే తుమకూరులో హేమావతి ఎక్స్‌ప్రెస్ కెనాల్ పనులు చేపట్టామని హోం, తుమకూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పరమేశ్వర్ తెలిపారు.

లిఫ్ట్‌లో చిక్కుకున్న గవర్నర్

7

జోయాలుక్కాస్‌తో సొంతింటి సాకారం

- 50మంది పేద కుటుంబాలకు సహకారం
- అప్పగించిన హోం మంత్రి పరమేశ్వర్

బెంగళూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): జోయాలుక్కాస్ ఫౌండేషన్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన 50మందికి సొంతింటి కల సాకారం చేశారు. నిమ్హాన్స్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం జరిగిన కార్యక్రమానికి హోం మంత్రి పరమేశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షత వహించిన జోయాలుక్కాస్ ఫౌండేషన్ చైర్మన్ జోయాలుక్కాస్ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు సేవలతోపాటు సామాజిక అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కేరళలో వెయ్యిమందికి డయాలసిస్ కిట్లను పంపిణీ చేశామని, పలు ఆసుపత్రుల వార్డులను ఆధునీకీకరించామని, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొవిడ్ కాలంలో తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు ఉచిత విద్యకు సాయం చేశామన్నారు. జాయ్ హోమ్స్ పేరిట 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక్కో ఇంటికి రూ.7.50లక్షల ఖర్చుతో 50మందికి ఇళ్లను నిర్మించామన్నారు. పేదరికం, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయినవారు, ఎండోసల్ఫాన్ బాధితులు, దివ్యాంగులకోసం ఇళ్లు నిర్మించామన్నారు. ఇప్పటివరకు కేరళ, తమిళనాడు, కర్ణాటకతో కలిపి 414 ఇళ్లు నిర్మించామన్నారు. ప్రాంతాలవారీగా మహిళలను చైతన్యం తీసుకొచ్చేందుకు బ్యూటీషియన్, టైలరింగ్ వంటి కోర్సులలో శిక్షణ ఇస్తున్నామన్నారు. హోం మంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ సమాజంలో వివిధ సమస్యలు ఎదుర్కొంటున్న పేదలకు కేవలం ప్రభుత్వం మాత్రమే కాకుండా వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సేవలు అందించాలని కోరారు. ఇళ్లు పొందిన 50మందికి రిఫ్రిజిరేటర్‌ను, మిక్సీలను బహూకరించారు.



లబ్ధిదారులకు ఇంటి తాళాలు అప్పగిస్తున్న హోం మంత్రి పరమేశ్వర్, జోయాలుక్కాస్ ప్రతినిధులు


ఎన్ఎండీసీ కంపెనీ వాడుతున్న కన్వేయర్ బెల్టు


వేగంగా దూసుకొస్తున్న మైనింగ్ టిప్పర్లు

మేమింతే..!

- సుప్రీం కోర్టు ఆదేశించినా మారని మైనింగ్ కాంట్రాక్టర్లు
- కన్వేయర్ బెల్టు ఏర్పాటులో నిర్లక్ష్యం
- టిప్పర్లు, లారీల్లోనే ఖనిజ రవాణా
- తరచూ రోడ్డు ప్రమాదాల్లో బలవుతున్న అమాయకులు

ముడి ఇనుము రవాణాలో ప్రాణాలు పోతున్నా కాంట్రాక్టర్లు మారడం లేదు. ఖనిజ రవాణాకు కన్వేయర్ బెల్టులు ఏర్పాటు చేసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశించినా లారీలు, టిప్పర్లలోనే తరలిస్తున్నారు.

8

క్రైం కార్నర్

కర్ణాటక బస్సు, కారు ఢీ

● వృద్ధుడి మృతి, నలుగురికి గాయాలు



బస్సు కింద ఇరుక్కుపోయిన కారు

ఉరవకొండ, మే31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి గ్రామ సమీపాన శనివారం కేఎస్ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ప్రమాదంలో జాన్‌రెడ్డి (80) అనే వృద్ధుడు మృతి చెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ధర్మవరానికి చెందిన జాన్ రెడ్డి కుటుంబసభ్యులు హంపికి వెళ్లి, కారులో తిరుగు ప్రయాణమయ్యారు. బూదగవి సమీపాన అనంతపురం నుంచి గంగావతికి వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు కారును ఢీకొంది. బస్సు కింద కారు ఇరుక్కుపోయింది. కారులో ప్రయాణిస్తున్న జాన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య చిన్నమ్మ, కుమార్తె సైనీదీప్తి, మనవడు రోహన్‌తోపాటు డ్రైవర్ వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం వెళ్లాలని వైద్యులు సూచించారు. ప్రమాద స్థలాన్ని సీఐ మహానంది పరిశీలించారు. జాన్‌రెడ్డి మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మళ్లీ అదే సీన్

● ఫయాజ్ ఇంటి కొలతలకు వెళ్లిన అధికారులు
● కొందరిని లోపలికి పంపడానికి అభ్యంతరం



ఇంటిని కొలుస్తున్న అధికారులు

తాడిపత్రి, మే 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నబజారులో ఉన్న వైసీపీ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా కొత్త ఇంటికి సంబంధించి కొలతల విషయంలో అధికారులతో శనివారం వాగ్వాదం జరిగింది. ఫయాజ్‌బాషా మున్సిపల్ స్థలాన్ని కొంత ఆక్రమించి కొత్తగా ఇంటిని నిర్మించాడని మున్సిపల్ అధికారులు గతంలో ఆయన ఇంటివద్దకు వెళ్లారు. విషయం కోర్టులో నడుస్తోందని ఫయాజ్‌బాషా మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇదేక్రమంలోనే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు ఎన్‌క్రోచ్‌మెంట్‌లో ఉన్న ఫయాజ్ ఇంటి నిర్మాణాలను తొలగించాలని ఎక్స్‌కవేటర్ తీసుకువెళ్లిన విషయం తెలిసిందే. ఈ విషయంగా వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య రాళ్ల దాడులు జరిగాయి. దీంతో జిల్లా అధికారులు కొలతల విషయంగా ఒక కమిటీని నియమించారు. ఆ కమిటీ 20రోజుల కిందట ఫయాజ్‌బాషా ఇంటివద్దకు వెళ్లగా ఎవరూ లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. మళ్లీ శనివారం ఇంటి కొలతలకు కమిటీ సభ్యులు వెళ్లగా, కొంతమంది లోపలకు రాకూడదని ఫయాజ్ అభ్యంతరం తెలిపాడు. దీంతో కొంత వాగ్వాదం జరిగింది. తహసీల్దార్ రజాక్‌వలి జోక్యం చేసుకొని కమిటీలో సభ్యులు మాత్రమే లోపలికి వెళతామని చెప్పారు. అధికారులు మాత్రమే వెళ్లాలని కౌన్సిలర్లకు ఏమి సంబంధమని వారిని వెళ్లనిచ్చేది లేదని ఫయాజ్‌బాషా వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులను మాత్రమే లోపలికి పంపించి కొలతలు జరిగేటట్లు చూశారు.

చీనీ టన్ను రూ. 30వేలు

అనంతపురం రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 30వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 18వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 508 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ప్రగతి రైలు కోచ్ రెస్టారెంట్ పరిశీలన



డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాకు స్వాగతం పలుకుతున్న అధికారులు..

అనంతపురం న్యూటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రగతి రైలు కోచ్ రెస్టారెంట్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా శనివారం పరిశీలించారు. రెస్టారెంట్ డైరెక్టర్ ఆనంద్ ఆయనకు స్వాగతం పలికారు. గుంతకల్లు డివిజన్ పరిధిలో రెండో రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను అనంతపురంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని డీఆర్ఎం అన్నారు. రైల్వే ప్రయాణికులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడంలో భాగంగా, పాత రైల్‌కోచ్‌లతో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు ఉండేలా రెస్టారెంట్ అందుబాటులోకి తెచ్చామని అన్నారు.

ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

● పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస యాదవ్

అనంతపురం అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు తప్పనిసరిగా ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస యాదవ్ సూచించారు. స్థానిక పరిశ్రమల శాఖ జీఎం కార్యాలయంలో శనివారం వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ... ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఉంటేనే బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తారన్నారు. బిజినెస్ చేయాలనుకునే వారు ముందస్తుగానే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీ రాజశేఖర్‌రెడ్డి, ఐపీఓ రవీంద్రనాథ్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చలపతి, సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య ముఖ్యం: ఎస్పీ

అనంతపురం క్రైం, మే31(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్య పిల్లల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని ఎస్పీ జగదీష్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పోలీసు పిల్లల సమ్మర్ క్యాంపు-2025 ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే రంగాల్లో రాణించేలా వారిని ప్రోత్సహించాలన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఫోన్లు, టీవీలు, ల్యాప్‌టాప్‌లతో సమయం వృథా చేయకుడా వారిలో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడానికి ఏటా జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ నేర్చుకున్నవి వారంలో కనీసం రెండు, మూడు గంటలైనా సాధన చేయించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం సమ్మర్ కోచింగ్ క్యాంపులో వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థులను అభినందిస్తూ పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఇలియాజ్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్ రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

గోదాముల్లోనే... పప్పుశనగ..!

● గిట్టుబాటు ధరలేక పెరిగిన నిల్వలు
● తక్కువ ధరకే కొందరు రైతుల విక్రయం
● ధర పెరుగుతుందన్న ఆశలో చాలామంది..



గోదాములో నిల్వ ఉంచిన పప్పుశనగ పంట

అనంతపురం అర్బన్/బెళుగుప్ప, మే 31(ఆంధ్రజ్యోతి): ఆశించిన ధరలు రాకపోవడంతో రైతులు నిల్వచేసిన పప్పుశనగ గోదాముల్లోనే మూలుగుతోంది. గిట్టుబాటు ధర లేకపోవడంతో రెండేళ్లుగా పప్పుశనగను గోదాముల్లో నిల్వ చేసుకున్నారు. గత ఏడాది రబీ పంటను ఎక్కువ మంది మంది రైతులు నిల్వ చేసుకున్నారు. డబ్బులు అత్యవసరమైన రైతులు బయట వ్యాపారులకు అమ్మేశారు. మరికొందరు ధరలు పెరుగుతాయన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. ఈ రబీసీజన్‌లో కొత్త పంట కూడా జత కావడంతో గోదాముల్లో నిల్వలు పెరిగిపోయాయి. గత ఏడాది రబీలో సాగు చేసిన పప్పుశనగ పంట కోతలు ఈ ఏడాది ఫిబ్రవరిలో పూర్తయ్యాయి. అప్పట్లో పప్పుశనగ నాణ్యత ఆధారంగా క్వింటా ధర రూ.5వేల నుంచి రూ.5,500 దాకా పలికింది. పంట కోతలు పూర్తయి మూడు మాసాలు గడుస్తున్నా ధరలో పెద్దగా మార్పు కనిపించలేదు. రబీ సీజన్ ఆరంభంలో విత్తనం వేసేందుకు క్వింటా పప్పుశనగ రూ.7వేల నుంచి రూ.8వేలతో కొనుగోలు చేశారు. గత ఏడాది ఎకరాకు 4 క్వింటాళ్లలోపు దిగుబడి వచ్చింది. పంట సాగు కోసం రూ.20 వేల దాకా పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం క్వింటా రూ.5,800 పలుకుతోంది. కష్టపడి పంట పండించిన తర్వాత కొనుగోలు చేసిన ధర కూడా లభించకపోవడంతో ఏం చేయాలో తోచని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. 2023-24 సంవత్సరంలో పంట కోత సమయంలో క్వింటా రూ.5500 పలికింది. తర్వాత కొన్ని నెలలకు క్వింటా పప్పుశనగ రూ.6వేల నుంచి రూ.6500 పెరిగింది. కొన్నేళ్ల క్రితం క్వింటా రూ.10వేలకు పైగానే పలికింది. తర్వాత ప్రతి ఏడాది ధర తగ్గుతూ వస్తోంది. దళారులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లుగా గోదాముల్లోనే...

ఆశించిన స్థాయిలో పప్పుశనగ ధరలు లేకపోవడంతో గత రెండేళ్లుగా ఎక్కువ శాతం పప్పుశనగ పంట ఉత్పత్తులు గోదాముల్లో నిల్వ చేసుకున్నారు. బెళుగుప్ప మండలంలో ఐదు గోదాములు ఉన్నాయి. రెండేళ్ల నుంచి పప్పుశనగ పంట ఉత్పత్తులు నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం ఒక్కో గోదాములో 5వేల మెట్రిక్ టన్నుల పప్పుశనగ నిల్వ ఉన్నట్లు గోదాముల నిర్వాహకులు చెబుతున్నారు. విడపనకల్లులోని గోదాములో 800 క్వింటాళ్ల పప్పుశనగ నిల్వ ఉంది. మిగతా ప్రాంతాల్లోని గోదాముల్లో ఇదే స్థాయిలో నిల్వలు ఉన్నట్లు సమాచారం.

భారమవుతున్న బాడుగలు

గోదాముల్లో నిల్వచేసుకున్న పప్పుశనగకు బాడుగలు చెల్లించడం రైతులకు భారమవుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు శీతల గిడ్డంగులు ఉన్నాయి. ఉరవకొండ, బెళుగుప్ప, విడపనకల్లు, పుట్లూరు, తాడిపత్రి, కణేకల్లు తదితర మండలాల్లో ప్రైవేటు వ్యక్తులు శీతల గిడ్డంలు ఏర్పాటు చేశారు. బెళుగుప్ప మండలంలోని గోదాముల్లో ఆరు నెలలకు క్వింటాకు రూ.రూ.60 నుంచి 70 వరకు బాడుగ వసూలు చేస్తున్నారు. ఏడో నెల నుంచి క్వింటాపై నెలకు రూ.10 అదనంగా బాడులు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. విడపనకల్లులో క్వింటాలు పప్పుశనగకు ఏడాదికి రూ.150, ఉరవకొండలో ఏడాదిలోపు వరకు క్వింటాలుకు రూ.100 వసూలు చేస్తున్నారు. పుట్లూరు మండంలో క్వింటాలుకు నెలకు రూ.10 వసూలు చేస్తున్నారు.

గిట్టుబాటు ధర వస్తేనే గట్టెక్కేది



పంట పండుతుందన్న ఆశతో ప్రతి ఏడాది పప్పుశనగ పంట సాగుచేస్తున్నా. గతేడాది 50 ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశాను. ఎకరాకు 4 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈసారి దిగుబడి తగ్గినా ధరలు అంతంతగానే ఉన్నాయి. దిగుబడి తగ్గినప్పుడు సాధారణంగా ధరలు పెరగాలి. మరెందుకో పంట కోత సమయం నుంచి ఇప్పటి దాకా ధరలో పెద్దగా మార్పు కనిపించడం లేదు. ధర పెరగకపోతుందా..? అన్న ఆశతో పంటనంతా గోదాముల్లో నిల్వ చేశా. గిట్టుబాటు ధర వస్తేనే గట్టెక్కేది. లేకుంటే నష్టపోవాల్సిందే.

- బి.ఆదినారాయణ, తగ్గుపర్తి, బెళుగుప్ప మండలం

పంటంతా గోదాములోనే నిల్వ చేశా



గతేడాది రబీలో 25 ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశా. ఎకరాకు 4 నుంచి నాలుగున్నర క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో కొంత ఎక్కువగా ఉంది. పెట్టుబడులు ఎక్కువైనందున ఆ ధరకు పంటను అమ్మితే నష్టమే. అందుకే ఈసారి రైతులెవరూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించలేదు. గతేడాది పప్పుశనగ పంటంతా గోదాములోనే నిల్వ చేశా. ఐదేళ్లుగా ఆశించిన మేరకు ధరలు లేకపోవడంతో నష్టపోతూనే ఉన్నాం. ఈసారి ఏమైతుందోనని ఆందోళనగా ఉంది.

-రుద్రయ్య, ఎర్రగుడి, బెళుగుప్ప మండలం

తప్పనిసరిగా కదల్లేదు..!

● ఐదేళ్లు దాటినా అక్కడే తిష్ట
● జడ్పీ బదిలీల్లో మాయాజాలం
● చక్రంతిప్పిన యూనియన్ నాయకులు, అధికారులు



కౌన్సెలింగ్ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, సీఈఓ

అనంతపురం విద్య, మే 31(ఆంధ్రజ్యోతి): జడ్పీలో బదిలీల్లో అయినవారికి అనుకున్న చోటే పీఠమేశారు. కాని వారిని సాగనంపారు. తొమ్మిదేళ్ల.. పదేళ్ల ఒకేస్థానంలో పనిచేసిన ఉద్యోగులు కదలాల్సి ఉన్నా.. పాత స్థానాలనే దక్కించుకున్నారు. కొందరు గొంతెత్తి అడిగినా పాత స్థానాలను ఇవ్వలేదు. కొందరు సంఘాల నాయకులు, అధికారులు తెర వెనుక తతంగం నడిపారు. దీనికి పాలకులు, అధికారులు రైట్ రైట్ అంటూ తలులు ఊపారు. జడ్పీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా జడ్పీ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ శనివారం నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరిగింది.

తప్పనిసరి అయినా..

రెండు జిల్లాల్లో ఐదేళ్ల ఒకేచోట పనిచేసిన కొందరు ఉద్యోగులను పాలకులు, అధికారులు కదిలించలేదు. నిబంధనల మేరకు వారు ఖచ్చితంగా బదిలీ కావాల్సి ఉన్నా పట్టించుకోలేదు. అదే స్థానంలో ఉంటామని కొందరు అడిగిందే తడవు అనుగ్రహించారు. మరికొందరు ఐదేళ్ల సర్వీసు పూర్తి అయిందని, మరో ప్రాంతానికి వెళతామని అడిగినా.. వారు కోరిన స్థానాలుగాని, ఆప్షన్ పెట్టినవిగాని ఇవ్వలేదు. కౌన్సెలింగ్‌లో కొందరు సంఘాల నాయకులు, జడ్పీలో చక్రం తిప్పే కొందరు అధికారుల హవా నడిచింది. వారు చెప్పినట్లు కౌన్సెలింగ్ నిర్వహించారని ప్రచారం జరుగుతోంది. తమకు తీరని అన్యాయం చేశారని బాధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బదిలీ అయిన జడ్పీ ఉద్యోగుల వివరాలు

కేడర్	తప్పసరి దరఖాస్తులు	తప్పసరి బదిలీ	రిక్వెస్టు దరఖాస్తులు	రిక్వెస్టు బదిలీ
ఎంపీడీఓలు	0	0	8	4
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు	0	0	13	6
సీనియర్ అసిస్టెంట్లు	10	4	16	3
జూనియర్ అసిస్టెంట్లు	6	2	32	15
టైపిస్టులు	3	0	9	3
రికార్డు అసిస్టెంట్లు	46	12	16	3
ల్యాబ్ అసిస్టెంట్లు	12	9	5	3
లైబ్రరీ అసిస్టెంట్లు	1	1	0	0
ఆఫీస్‌సబార్డినేట్స్	74	14	14	11
మొత్తం	152	42	113	48

అధికారుల లెక్కలు ఇవీ...

ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎంపీడీఓలు బదిలీ అయ్యారని అధికారులు ప్రకటించారు. విజయ భాస్కర్ ముదిగుప్ప మండలం నుంచి బొమ్మనహాళ్ మండలానికి, ఆజాద్ రామగిరి మండలం నుంచి తనకల్లుకు, గంగావతి నార్పల మండలం నుంచి రామగిరికి, మమతాదేవి తనకల్లు నుంచి నార్పలకు బదిలీ అయినట్లు ప్రకటించారు. తప్పనిసరి బదిలీ కింద 152 మంది ఉద్యోగులు దరఖాస్తు చేయగా 42 మందిని, రిక్వెస్టు కింద 113 మంది దరఖాస్తు చేయగా 48 మందిని బదిలీ చేసినట్లు జడ్పీ అధికారులు ప్రకటించారు. వీరిలో ఎంపీడీఓలు, ఏవోలు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులు ఉన్నారు.



జడ్పీ మెయిన్ హాల్ వద్ద ఉద్యోగుల హడావుడి



మాట్లాడుతున్న విద్యానృసింహ భారతి స్వామి

ధర్మ పరిరక్షణ కోసం ఏకతాటిపైకి రావాలి

● విద్యా నృసింహ భారతి స్వామి
● ముగిసిన బజరంగ్‌దళ్ శిక్షణా తరగతులు

అనంతపురం కల్చరల్, మే 31(ఆంధ్రజ్యోతి): దేశంలో ధర్మ పరిరక్షణ కోసం అన్నివర్గాలవారూ ఏకతాటిపైకి రావాలని విద్యానృసింహ భారతిస్వామి అన్నారు. నగర శివారు వడియంపేట వద్ద గల కేశవరెడ్డి పాఠశాలలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకటరత్నమయ్య ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బజరంగ్‌దళ్ శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి విద్యా నృసింహభారతి స్వామి హాజరై ప్రసంగించారు. యువత దేశ రక్షణ, ధర్మ పరిరక్షణే ధ్యేయంగా భావజాలాన్ని పెంపొందించుకోవాలన్నారు. సమాజంలో హిందూధర్మ వ్యతిరేకవాదులు చేస్తున్న అరాచకాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ఉభయ తెలుగు రాష్ట్రాల కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్, బజరంగ్‌దళ్ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ వీరకుమార్‌స్వామి, పోలేపల్లి సందీప్, కసాపురం రవి, జిల్లా కార్యదర్శి విశ్వనాథరెడ్డి, సహాయ కార్యదర్శి బొబ్బ కిశోర్‌నాయుడు, జిల్లా కన్వీనర్ సురేంద్రబాబు, ఉపాధ్యక్షుడు కోనేటి రమణబాబు, జిల్లా గోరక్ష ప్రముఖ్ గుర్రం సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను అనంతపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ శర్మ తదితర అధికారులు సత్కరించారు. మొత్తం 33 మంది ఉద్యోగులు, అధికారులు, అధ్యాపకులు పదవీ విరమణ పొందిన సందర్భంగా కలెక్టరేట్‌కు వచ్చి.. అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్అండ్‌బీలో క్లరికల్ సిబ్బందికి బదిలీలు



సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఈ రాజగోపాల్

అనంతపురం న్యూటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆర్ అండ్‌బీలో ఉన్న క్లరికల్ సిబ్బందికి ఎస్ఈ రాజగోపాల్ ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయంలో శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐదేళ్ల ఒకే చోట ఉద్యోగ కాలాన్ని పూర్తి చేసుకున్న వారితో పాటు జీఓలో పేర్కొన్న విధంగా అర్హతలు ఉన్న వారు కూడా కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. జూనియర్ అసిస్టెంట్లు-8, టైపిస్టు-2, రికార్డు అసిస్టెంట్లు-3, అటెండర్లు-33, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు 4, డ్రైవర్లు ఇద్దరు అప్షన్లు ఇవ్వడంతో కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. అందుకు అనుగుణంగా జాబితా తయారు చేసి తుది జాబితాను వెల్లడించనున్నట్లు ఎస్ఈ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ డిప్యూటీ ఎస్ఈ రమాదేవి, ఎన్‌హెచ్ ఈఈ సుధాకర్ రెడ్డి, ఆర్ అండ్‌బీ ఈఈలు ప్రసాద్‌రెడ్డి, సంజీవయ్య పాల్గొన్నారు.

డీపీఓలో కార్యదర్శులకు...

జిల్లా పంచాయతీ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు ఒకేచోట ఐదేళ్ల ఉద్యోగ కాలాన్ని పూర్తి చేసిన వారికి డీపీఓ నాగరాజనాయుడు ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రేడ్-1, ఆరుగురు, గ్రేడ్-3, 11 మంది, గ్రేడ్-4 32 మందితోపాటు మరో ముగ్గురు డిప్యూటీ ఎంపీడీఓలు మొత్తం 52 మందికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు డీపీఓ పేర్కొన్నారు. బదిలీల జాబితా తయారు చేసి కలెక్టర్ ఆమోదానికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, ఏఓ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్లు లీలాబాయి, ఉష తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీఓ నాగరాజనాయుడు

తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు గుంతకల్లు వరకు పొడిగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎర్రగుంట్ల/కొండాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): కడప-విశాఖపట్నం మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు (ట్రైన్ నెంబర్18521/18522) ను జూన్ 2 నుంచి గుంతకల్లు వరకు పొడిగించినట్లు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కడప నుంచి గుంతకల్లు వరకు ఈ ట్రైన్‌ను స్పెషల్ ట్రైన్ (నెంబర్ 07521 /07522) గా ట్రీట్ చేస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం నుంచి కడపకు ఉదయం 7..45 గంటలకు చేరుకుని ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి మీదుగా గుంతకల్లుకు ఉదయం 11.15కు చేరుతుంది. తిరిగి గుంతకల్లులో మధ్యాహ్నం 1.30కి బయలుదేరి కడపకు సాయంత్రం 5.15 కు చేరుకుంటుంది. అక్కడి నుంచి విశాఖపట్నం వెళుతుంది. గతంలో కడప-కొండాపురం మధ్య ఖాళీగా వెళ్లే ఈ రైలుకు ఎర్రగుంట్ల, కొండాపురం రైల్వేస్టేషన్‌లలో స్టాపింగ్ ఇవ్వాలని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలు ప్రచురించింది. అంతేకాకుండా స్టాపింగ్ కోసం ప్రజాప్రతినిధులు, పలు ప్రజాసంఘాలు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తెచ్చారు. దీంతో ఈ రైలును కడప నుంచి గుంతకల్లు వరకు పొడిగించడంతో పాటు ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు రైల్వేస్టేషన్‌లలో స్టాపింగ్ ఇస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ పాలనలో ఆర్థిక వ్యవస్థ కుదేలు

● ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమానికి ప్రాధాన్యం
● మంత్రి పయ్యావుల కేశవ్ ● గొట్కూరులో పింఛన్ సొమ్ము పంపిణీ



పింఛన్ అందజేస్తున్న మంత్రి కేశవ్

ఉరవకొండ/కూడేరు, మే 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో పరిశ్రమలను పారదోలి, పెట్టుబడులు లేకుండా చేసి ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చారని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. కూడేరు మండలం గొట్కూరులో శనివారం పింఛన్ల పంపిణీలో కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. స్థానికులు సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం నడపడానికి ఆర్థిక ఇబ్బందులున్నా సీఎం చంద్రబాబు ప్రతి హామీనీ అమలు చేస్తున్నారని అన్నారు. త్వరలోనే అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం డబ్బులు విడుదల చేస్తామని అన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం.. జీతాలు, వడ్డీలు కట్టడానికే సరిపోతోందన్నారు. గత ప్రభుత్వం సంపదను సృష్టించకపోవడం మూలంగానే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, డీఆర్‌డీఏ పీడీ శైలజ, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పంపిణీలో మూడో స్థానం

అనంతపురం క్లాక్‌టవర్: జిల్లాలో తొలి రోజు 2,61,875 మందికి రూ.116 కోట్ల పింఛన్ పంపిణీ చేశారు. 94.26 శాతం పంపిణీతో రాష్ట్రంలో జిల్లాను మూడో స్థానంలో నిలిపారు. డీఆర్‌డీఏ-వెలుగు ఇన్‌చార్జి పీడీ శైలజ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. తాడిపత్రి మున్సిపాలిటీలో అత్యధికంగా 96.73 శాతం పంపిణీ చేశారు. రాయదుర్గం మున్సిపాలిటీ 95.73 శాతంతో ద్వితీయ స్థానం, పామిడి 95.71 శాతంతో తృతీయస్థానంలో నిలిచాయి. గుంతకల్లులో అత్యల్పంగా 91 శాతం పంపిణీ జరిగింది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

నీలం సంజీవరెడ్డి (వర్ధంతి)



భారతదేశ ఆరో రాష్ట్రపతిగా వ్యవహరించిన నీలం సంజీవరెడ్డి 1913 మే 19న అనంతపురం జిల్లా ఇల్లూరు గ్రామంలో జన్మించారు. రాష్ట్రపతిగా 1977-82 మధ్య వ్యవహరించారు. మొరార్జీ దేశాయ్, చరణ్‌సింగ్, ఇందిరాగాంధీ వంటి ప్రధానులతో కలసి పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, లోక్‌సభ సభాపతిగా, ఆంధ్రరాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, సంయుక్త మద్రాసు రాష్ట్రంలో మంత్రిగా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వివిధ పదవులను అలంకరించి ప్రజల మన్ననలు పొందిన రాజకీయవేత్త. లోక్‌సభ సభాపతిగా ఎన్నిక కాగానే తన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి మంచి వాతావరణం నెలకొల్పి స్పీకర్ పదవికే వన్నె తెచ్చిన రాయలసీమ రాజకీయ ఆణిముత్యం. 1996 జూన్ 1న బెంగళూరులో కన్నుమూశారు.

నర్గీస్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత నర్గీస్ దత్ 1929 జూన్ 1న జన్మించారు. అసలు పేరు ఫాతిమా రషీద్. హిందీ సినీరంగంలో పేరొందిన నటుడు సునీల్‌దత్ భార్య. వీరి కుమారుడు సంజయ్‌దత్ కూడా నటుడిగా పేరొందారు. మూడు దశాబ్దాలపాటు తిరుగులేని నటిగా రాణించారు. రాజ్‌కపూర్‌తో కలసి పలు హిట్ సినిమాలలో నటించారు. 1957లోని 'మదర్ ఇండియా' సినిమాలో ఆమె నటనకు ఉత్తమ నటి, ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. రాజ్యసభ సభ్యురాలిగానే కాకుండా సమాజసేవలో రాణించారు. 1981 మే 3న కన్నుమూశారు.

మోర్గాన్ ఫ్రీమాన్ (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన ప్రముఖ నటుడు మోర్గాన్ ఫ్రీమాన్ 1937 జూన్ 1న జన్మించారు. నటుడిగానే కాక దర్శకుడు, నరేటర్, తనదైన గొంతుతో అభిమానులను ఆకట్టుకున్నారు. వివిధ పాత్రలతో అన్ని తరాలవారిని అలరించారు. అకాడమీ అవార్డు, గోల్డెన్ గ్లోబ్ అవార్డు, స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ సపోర్టింగ్ నటుడిగా పలు అవార్డులు పొందారు. 'నౌ యూ సీ మి : నౌ యూ డోంట్' సినిమా 2025 నవంబరులో విడుదల కానుంది.

కరణం మల్లీశ్వరి (పుట్టినరోజు)



ఒలింపిక్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో 2000లో 69 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించిన దేశ తొలి మహిళా వెయిట్‌లిఫ్టర్, 'పద్మశ్రీ' గ్రహీత కరణం మల్లీశ్వరి 1975 జూన్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా ఊసవానిపేటలో జన్మించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, అర్జున అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు. ఇస్తాంబుల్‌లో 1995లో జరిగిన వరల్డ్ చాంపియన్ షిప్‌లో 113 కిలోల విభాగంలో రజతపతకం సాధించారు. 29 ఇంటర్నేషనల్ మెడల్స్ సాధించగా వీటిలో 11 బంగారు పతకాలు ఉండడం విశేషం. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో చీఫ్ జనరల్ మేనేజర్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం ఢిల్లీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ యూనివర్సిటీకి 2021 జూన్‌లో వైస్ చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు.

దినేశ్ కార్తీక్ (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ దినేశ్ కార్తీక్ 1985 జూన్ 1న తమిళనాడు రాష్ట్రం మద్రాస్‌లో జన్మించారు. ఇండియన్ క్రికెట్ టీమ్, ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడారు. ప్రస్తుతం తమిళనాడు క్రికెట్‌టీమ్‌కు కేప్టెన్‌గా ఉన్నారు. టి-20 మ్యాచ్‌లు 300 ఆడిన నాల్గో ఇండియన్ బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందారు. 2019 క్రికెట్ వరల్డ్‌కప్‌లో 'ఇండియాస్ స్క్వాడ్' పేరు పొందారు. అంతేకాక 2021-21ల మధ్య బ్రిటీష్ చానెల్ స్కై స్పోర్ట్స్‌కు కామెంటేటర్‌గా కూడా వ్యవహరించారు. కాగా స్క్వాష్ క్రీడాకారిణి దీపికా పల్లికాల్‌ను వివాహం చేసుకున్నారు.

అదనపు తరగతి గదుల కోసం రూ.10లక్షలు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

ముళబాగిలు, మే 31(ఆంధ్రజ్యోతి): కన్నసంద్ర ప్రభుత్వ పాఠశాలకు అదనపు గదుల నిర్మాణానికి నియోజకవర్గ ప్రదేశాభివృద్ధి నిధులు రూ.10 లక్షలు కేటాయించడంతోపాటు క్రీడామైదానం, పాఠశాల ముందు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారు దేశవిదేశాలలో ఉన్నత హోదాలలో ఉన్నారని, ప్రభుత్వ పాఠశాలల పట్ల చిన్నచూపు చూడరాదని తల్లిదండ్రులకు ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. తాలూకాలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు మన ఊరి పాఠశాల అనేభావంతో పాఠశాల విద్యా అభివృద్ధికి మీవంతు సహకారం అందించాలన్నారు. కాగా తాలూకాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కొరత అంశం తన దృష్టికి వచ్చిందని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేందుకు గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు, ఎస్‌డీఎంసీ, పూర్వ విద్యార్థులు విద్యాశాఖ అధికారులకు సహకారం అందించాలన్నారు. స్థానిక విద్యాశాఖ అధికారులు ఉత్తమంగా సేవలందించడంపై ప్రశంసించారు. ప్రైవేట్ స్కూళ్ల పోటీ నేపథ్యంలోనూ కన్నసంద్ర పాఠశాలలో 85మంది విద్యార్థులు ఉండడం స్వాగతార్హమన్నారు. మరింత విద్యార్థులను చేర్చేందుకు ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలన్నారు. బీఈఓ రామచంద్ర మాట్లాడుతూ తాలూకాలోని కన్నడ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, క్షీరభాగ్య వంటి పథకాలతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, బ్యాగ్, ఇతర రాత సామగ్రి ఇస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హనుమప్ప, రవి, గ్రామపంచాయతీ సభ్యులు విశ్వనాథరెడ్డి, రాధాకృష్ణ, అమరప్ప, తిప్పణ్ణ, కరడగూరు, వెంకటేశప్ప, మణి, మంజునాథ్, నారాయణస్వామి, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు మునికృష్ణ, కేవీ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు నలుగురు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారు

బెంగళూరు, మే 31(ఆంధ్రజ్యోతి): మోనిన్ కాఫీ క్రియేటివిటీకప్ ప్రాంతాల వారీగా నిర్వహిస్తున్న పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బెంగళూరులో జరిగిన దక్షిణ ప్రాంతీయ పోటీలలో నలుగురు విజేతలుగా నిలిచారు. వీరు జైపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హులయ్యారు. మోనిన్ ఇండియా ఏర్పాటు చేసిన పోటీలలో బ్యారిస్టాలు, కళాత్మకత, సువాసన ప్రదర్శించే ఓ క్రియాత్మకమైన వేదికగా ఉంది. ఫ్లేవర్ పోర్ట్‌ఫోలియో ఉపయోగించి ఎస్ప్రెసో ఆధారంగా మాక్‌టెల్‌లో స్ఫూర్తిదాయకమైన ప్రదర్శనలు ఇచ్చిన మేరకు విజేతగా నితిన్ నిలవగా, ఫైజ్ అలి తొలి రన్నరప్ కాగా నవనీత్ ఎస్, హర్షితలు రెండో రన్నరప్‌గా మిగిలారు. ఈ ఏడాది ఆల్కెమీ ఆఫ్ ఫ్లేవర్స్ పేరిట పోటీలు నిర్వహిస్తున్నారు.

యువత ప్రతిభకు సాంస్కృతిక ప్రదర్శనలే వేదికలు



నటుడు వశిష్ఠకు సన్మానం

బెంగళూరు, మే 31(ఆంధ్రజ్యోతి): యువ విద్యార్థులు చదువుతోపాటు వారికి ఉన్న ఆలోచన, ఆసక్తిని ప్రదర్శించేందుకు కళాశాలల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతిభచాటేందుకు వేదికలని ప్రముఖ నటుడు వశిష్ఠసింహ అభిప్రాయపడ్డారు. అమృత్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ 15వ వార్షికోత్సవం 'కళాకృతి 4.0' ను శనివారం నిర్వహించింది. ముఖ్యులుగా హాజరైన నటుడు వశిష్ఠసింహ సన్మానం స్వీకరించి మాట్లాడుతూ విద్యార్థులలో అసాధారణమైన ప్రతిభ ఉంటుందని ఇలాంటి వేదికలే ఎంతోమంది జీవితకాలం ప్రయాణాలకు మార్గదర్శకం అయ్యాయన్నారు. ప్రతి ఒక్కరికీ చదువుతోపాటు మరో కోణం ఉంటుందని, దానికి పదును పెట్టాలన్నారు. ఐహెచ్‌ఎం 2024 కలినరీ ఒలింపిక్స్‌లో బెంగళూరు క్యాంపస్ బంగారు పతకాన్ని సాధించడాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు భూమినాథన్, డీన్ సురేన్, రీజనల్ డైరెక్టర్ భానుమతి, ప్రిన్సిపాల్ స్వామినాథన్ పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందిస్తాం

» మాజీ ఎంపీ ఉగ్రప్ప వెల్లడి



సమావేశంలో మాజీ ఎంపీ ఉగ్రప్ప తదితరులు

బొమ్మనహళ్ళి, మే 31(ఆంధ్రజ్యోతి): పర్యావరణ దినోత్సవం సందర్భంగా బొమ్మనహళ్ళి నియోజకవర్గంలోని అన్ని వార్డులు, పార్కులలోనూ సుమారు 14వేల మొక్కలు నాటేలా కార్యాచరణ చేపట్టామని మాజీ ఎంపీ ఉగ్రప్ప తెలిపారు. స్థానిక స్వాభిమాన పార్కులో శనివారం ఏర్పాటైన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుల సమక్షంలో మొక్కలను ఎక్కడెక్కడ నాటాలి, సంరక్షణ తదితర అంశాలపై చర్చించారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి, మంత్రులను ఆహ్వానించామన్నారు. కార్యక్రమం కోసం కేపీసీసీ పరిశీలకులను పంపారు. అరికెరె, హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్, అగర, బొమ్మనహళ్ళి తదితర ప్రాంతాల పర్యవేక్షణ బాధ్యతను ఒక్కో మంత్రికి అప్పగించే అవకాశం ఉందన్నారు. మొక్కలు నాటడంతోపాటు వాటిని ఆసక్తిగా, బాధ్యతగా పెంచాలని పిలుపునిచ్చారు. పోలీసు, అటవీశాఖ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో కేపీసీసీ నుంచి గ్యారంటీ పథకాల సమితి అధ్యక్షుడు, హెచ్‌ఎస్‌ఆర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టీ వాసుదేవరెడ్డి, బిలేకహళ్ళి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశ్వత్థనారాయణ, కాంగ్రెస్ ప్రచార సమితి అధ్యక్షుడు కే వాసుదేవరెడ్డి, బొమ్మనహళ్ళి బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు రవీంద్ర, బెంగళూరు దక్షిణ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, సమర్థనం ట్రస్టు అధ్యక్షుడు మహంతేశ్, తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్‌లో చిక్కుకున్న గవర్నర్



సెంటర్ ఫర్ ఫ్యూచర్ స్కిల్స్ కేంద్రం ప్రారంభోత్సవంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ తదితరులు

బెంగళూరు, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ కొద్దిసమయంపాటు లిఫ్ట్‌లో చిక్కుకుని ఇబ్బందిపడ్డారు. శనివారం మైసూరులోని కర్ణాటక ఓపెన్ యూనివర్సిటీలో సెంటర్ ఫర్ ఫ్యూచర్ స్కిల్స్ కేంద్రాన్ని ప్రారంభించారు. యూనివర్సిటీలో లిఫ్ట్‌లో సిబ్బందితోపాటు ప్రవేశించారు. ఓవర్‌లోడ్ కావడంతో సగంలోనే లిఫ్ట్ ఆగిపోయింది. ఒక్కసారిగా భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే సాంకేతిక నిపుణులను రప్పించి లిఫ్ట్‌ను మరమ్మతులు చేయించారు. ఇలా కొద్దిసేపు గవర్నర్ లిఫ్ట్‌లోనే గడపాల్సి వచ్చింది. ఆ తర్వాత లిఫ్ట్ తెరుచుకున్నా అందులో ప్రవేశించేది లేదంటూ నడుచుకుంటూనే గవర్నర్ వెళ్లారు. కార్యక్రమంలో ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామిజీ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు లోను కారాదు



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

బాగేపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ప్రాథమికోన్నత పాఠశాలలో నమ్మక్లినిక్2 ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం పురస్కరించుకుని శనివారం ప్రత్యేక జాగృతి సమావేశం నిర్వహించారు. క్లినిక్ డాక్టర్ పవన్‌రెడ్డి మాట్లాడుతూ.. పొగాకు, పొగాకు ఉత్పత్తులపై ఆరోగ్యంపై దుష్ప్రభావం ఉందన్నారు. ప్రత్యేకించి విద్యార్థులు, యువత దుర్వ్యసనాలకు లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. బీడీ సిగరెట్, గుట్కా, జర్దా, నశ్యం, హుక్కా... ఇలా ఏ రీతిలో తీసుకున్నా దుష్ప్రభావం ఉందన్నారు. ప్రత్యేకించి శ్వాసకోశ క్యాన్సర్, గొంతు క్యాన్సర్, శ్వాసకోశ సమస్యలు ఇతరత్రా రోగాలకు కారణం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్ హనుమంతరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, కేవీ శ్రీనివాస్, ఈశ్వరప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాధకుల జీవితం ప్రేరణ కావాలి

» పద్మశ్రీ డాక్టర్ విజయలక్ష్మి దేశ్‌మానె పిలుపు



జ్ఞాపికలతో విద్యార్థులు, వేదికపై ప్రముఖులు

బెంగళూరు, మే 31(ఆంధ్రజ్యోతి): సమాజంలో భిన్నమైన రంగాలలో సాధకుల జీవితాలు విద్యార్థులకు ప్రేరణ కావాలని పద్మశ్రీ డాక్టర్ విజయలక్ష్మి దేశ్‌మానె అభిప్రాయపడ్డారు. నేషనల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో తొలి సెమిస్టర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 270మందికి ప్రత్యేకంగా అభినందించారు. నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ హెచ్‌ఎన్ సుబ్రమణ్య, గౌరవ కార్యదర్శి వెంకటశివారెడ్డి, కోశాధికారి తల్లం ఆర్ ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత శిబిరం



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

బెంగళూరు, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం పురస్కరించుకుని హెచ్‌సీజీ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత శ్వాసకోశ పరీక్షా శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఐదేళ్లకుపైగా ధూమపానం చేసేవారికి ఉచితంగా పరీక్షలు జరిపినట్టు హెచ్‌సీజీ రీజనల్ ముఖ్యులు మనీషా కుమార్ తెలిపారు. క్యాన్సర్ రాకముందే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలనే ప్రత్యేక శిబిరం నిర్వహించామన్నారు. మెడికల్ అంకాలజీ కన్సల్టెంట్ రోష్నిదాస్ గుప్త మాట్లాడుతూ సిగరెట్ పొగ వల్ల శరీరంలోని అన్ని అవయవాలపై చెడుప్రభావం ఉంటుందన్నారు. మా లక్ష్యం రోగానికి చికిత్స ఇవ్వడం కాదని, ముందస్తుగా హెచ్చరించడమే ఆశయమన్నారు. డాక్టర్ శాలిని ఠాకూర్, మల్లికార్జున, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో పలువురికి చికిత్సలు అందించారు.

డ్రైనేజీ పనులను పరిశీలించిన అధికారులు



పనులను పరిశీలిస్తున్న నగరసభ అధ్యక్షుడు, కమిషనర్

శిడ్లఘట్ట, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 28వవార్డు నిసార్ పాళ్యలో డ్రైనేజీ నిర్మాణ పనులను నగరసభ అధ్యక్షుడు ఎంవీ వెంకటస్వామి, కమిషనర్ మోహన్‌కుమార్, సభ్యుడు జబీవుల్లా తదితరులు కలసి పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతపాటించాలని అధ్యక్షుడు హెచ్చరించారు. వర్షపునీరు సజావుగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కాగా రోడ్డుపక్కన అక్రమంగా నిర్మించిన శౌచాలయాన్ని తొలగించాలని నగరసభ కమిషనర్, అధ్యక్షులు ఆదేశించారు. కాగా డ్రైనేజీ కాలువల వేళ కొంతమంది బాత్రూం నీటిని వదులుతున్నారని కాంట్రాక్టర్ మంజునాథ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈమేరకు నగరసభ సభ్యుడు జబీవుల్లా స్థానికులకు సూచనలు చేశారు. నగరసభ ఆరోగ్య అధికారి నరేశ్, ఇంజనీర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంలో ఒకరి హత్య - నిందితుడి అరెస్టు



శివ (ఫైల్)

చింతామణి, మే 31 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కెంచార్లహళ్ళి పోలీస్ స్టేషన్ పరిధిలోని భూమిశెట్టిహళ్ళి గ్రామంలో భూవివాదానికి సంబంధించి ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు యువకుల మధ్య వైషమ్యాలు హత్యకు దారి తీశాయి. భూమిశెటిహళ్ళికి చెందిన శివా అలియాస్ శివశంకర్ (35) హత్యకు గురయ్యాడు. అదే గ్రామానికి చెందిన నరేశ్ హతమార్చినట్టు గుర్తించారు. శివా మేనమామ కొడుకు నరేశ్. భూవివాదానికి సంబంధించి శివా ఇటీవల లాయర్ ద్వారా నరేశ్ కుటుంబానికి నోటీస్ ఇప్పించాడు. దీంతో విబేధాలు తీవ్రమయ్యాయి. ఇటీవల గ్రామపెద్దలచే రాజీ పంచాయితీ చేయించారు. కాగా శుక్రవారం రాత్రి సుమారు 10 గంటలకు పాఠశాల పిల్లలు ఆడే కార్యక్రమాన్ని చూసేందుకు వచ్చిన నరేశ్ అక్కడే ఉన్న శివా కడుపుపై చాకుతో పొడిచి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో శివా అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కెంచార్లహళ్ళి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం శివా భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఘటనపై జిల్లా ఎస్పీ కౌశల్‌చౌక్సీ ఆరా తీశారు. నిందితుడిని శనివారం ఉదయం మురగమల్లా హోబళి యర్రకోట మీదుగా వెళ్తున్నాడనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి అరెస్టు చేశారు.

నామినేటెడ్ సభ్యుడిగా మహబూబ్‌బాషా



మహబూబ్‌బాషా

ముళబాగిలు, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి 15అంశాల కార్యక్రమం కోలారు జిల్లాస్థాయి కమిటీ నామినేటెడ్ సభ్యుడిగా ముళబాగిలు పట్టణం టిప్పు సుల్తాన్ మెయిన్‌రోడ్డు నివాసి మహబూబ్ బాషా నియమితులయ్యారు. మైనారిటీల సంక్షేమం హజ్, వక్ఫ్‌శాఖల అండర్ సెక్రటరీ ఎస్ ఏజాస్‌పాషా ఆదేశాలు జారీ చేశారు. మహబూబ్ బాషా కొంతకాలంగా సమాజసేవలో ఉంటున్నారు. జిల్లా కాంగ్రెస్ మైనారిటీసెల్ విభాగం ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు.

శరవేగంగా హెచ్చెల్సీ లైనింగ్ పనులు

బొమ్మనహాళ్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాకి జీవనాడి అయిన తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో వస్తుండడంతో పనుల్లో వేగం పెంచారు. కాలువను గత పాలకులు నిర్వీర్యం చేశారు. కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. కాలువ గట్లు బలహీనపడడంతో నీరు కూడా తక్కువగానే తీసుకున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దీంతో హెచ్చెల్సీకి పూర్వ వైభవం తీసుకువస్తున్నారు. టెండర్ల ద్వారా నిధులు కేటాయించి సాగునీటి కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. రూ.28.05 కోట్లతో 11 పనులు చేపడుతున్నారు.

సైబర్ నేరాల పై అవగాహన

రాయచూరు, మే 31(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మంచలాపూర్ గ్రామంలో రాయచూరు రూరల్ పోలీసులు శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దొంగతనాలు,సైబర్ నేరాల గురించి ప్రజలకు వివరిస్తు వాటికి బారినపడకుండా తీసుకోవల్సిన జాగ్రతల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పోలీస్ అధికారి,విద్యావంతులే సైబర్ మోసాలకు గురవుతున్నట్లు తమ గణాంకాలు చెబుతున్నాయని ఈ విషయంలో అపరిచిత వ్యక్తులతో వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వార పరిచయాలు పెంచుకోవడం ప్రమాదకరమన్నారు. అపరిచిత వ్యక్తులకు స్వంత వివరాలు వెల్లడించవద్దని, ముఖ్యంగా బ్యాంక్ ఖాతా నెంబర్లు, ఏటీఎం పిన్ నెంబర్లు ఇతరత్ర వ్యక్తగత వివరాలను వెల్లడించవద్దన్నారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ పరిచయాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు.




ప్రత్యేక అలంకరణలో స్వామివారి మూల విరాట్

జనహోబిలం



దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

ఉరవకొండ, మే31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువు దీర్చి మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1592.96	1,577.38
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,778	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	153	30
నీటి నిల్వ (టీఎంసీలు)	13.68	3.33

మేమింతే..!

బళ్లారి, మే 31(ఆంధ్రజ్యోతి): ముడి ఇనుము రవాణాలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా కాంట్రాక్టర్లు తీరు మార్చుకోవడం లేదు. కొండ నుంచి ఖనిజాన్ని కిందకు తరలించడానికి కన్వేయర్ బెల్టులు ఏర్పాటు చేసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అయినా కొన్ని మైనింగ్ కంపెనీలు ఆదేశాలు పాటించడం లేదు. దీని కారణంగా రోడ్డు పై భారీ టిప్పర్లలో రవాణా చేస్తుండంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన జరిగిన లారీ-కారు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృత్యువాత పడ్డారు. రహదారులు కూడా దెబ్బ తింటున్నా కాంట్రాక్టర్లు టిప్పర్ల రవాణానే కొనసాగిస్తున్నారు.

సందూరు పరిదిలో జిందాల్(జేఎస్‌డబ్ల్యూ), ఎన్ఎండీసీ, స్మైర్, ఎంఎంఎల్, వెస్కాం. టీకేజీ ఇలా అనేక మైనింగ్ కంపెనీలు ఉన్నాయి. ఈ గనుల నుంచి ఏటా సరాసరి 35 మిటియన్ టన్నుల ఖనిజానిన తవ్వకాలు చేసి విక్రయాలు చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం ఏటా మిలియన్ టన్ను ఖనిజం ఉత్పత్తి చేసే కంపెనీలు ఖనిజం కిందకు తరలింపునకు కన్వేయర్ బెల్ట్ మాత్రమే వాడాలి. ఇందులో జిందాల్, ఎన్ఎండీసీ కంపెనీలు మాత్రమే బెల్టులను ఉపయోగిస్తున్నారు. మిగిలిన కంపెనీలు లారీలు, టిప్పర్లనే వాడుతున్నారు. రోడ్డు మార్గంలో ట్రక్కుల ద్వారా ఖనిజం రవాణా చేస్తున్నారు. సందూరు కుమారస్వామి దేవాలయం, దేవగిరి, సందూరు, హొస్పేట్, ధర్మపురం, యశ్వంత్‌నగర్, సందూరు తోరణగల్లు ప్రధాన రోడ్డుపైనే ట్రక్కుల ద్వారా నిత్యం రవాణా చేస్తున్నారు. ట్రాఫిక్ అధికారుల అంచనా ప్రకాంరం రోజూ 11 వేల టిప్పర్లు ముడిఖనిజంతో రవాణా చేస్తున్నాయి. కనురెప్ప పాటు సమయంలో తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయి. దీంతో ఇతర వాహనదారులు, అబులెన్సులు, ఆర్టీసీ బస్సులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2022 నుంచి 24 వరకూ సందూరులోనే 330 ప్రమాదాలు జరిగాయి. ఇందులో 126 మంది ప్రాణాలు కోల్పోయారు. 500 మందికిపైగా గాయపడ్డారు. ఈ రోడ్డుపై ప్రయాణం అంటే జనం బెంబేలెత్తిపోతున్నారు.

బెల్టులు తప్పనిసరి చేయాలి
:టీఎం శివకుమార్, జనసంగ్రామ నాయకులు

కన్వేయర్ బెల్టులులేని ఇనుప గనుల్లో తవ్వకాలు తగ్గించాలి. నిబంధనలు పాటించని కంపెనీలు జిల్లా యంత్రాంగం వెంటనే సీఈసీకి ఫిర్యాదు చేయాలి. ఇనుము ముడిఖనిజం రవాణా చేసే ట్రక్కుల డ్రైవర్లు నిబంధనలు పాటించాలి. ట్రాఫిక్ పోలీసులు ఇనుప ముడిఖనిజం రవాహా చేసే డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. తాగి ఎవరూ డ్రైవింగ్ చేయకూడదు.

పొగాకు ఉత్పత్తులు ప్రాణాంతకం: డీహెచ్ఓ

బళ్లారి సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులను వాడటం మానేయాలని, సరదాగా ప్రారంభమైన అలవాటు ప్రాణం మీదకు తెస్తుందని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్ బాబు అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా నగరంలోని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పొగాకులో దాదాపు 7000 రసాయన భాగాలు ఉన్నాయని, పొగాకులోని ఏదైనా పదార్థాలను తీసుకోవడం వల్ల మానవుల్లో మూత్రపిండాల వైఫల్యం, నాడీ బలహీనత,కాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాదులు వస్తాయన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించడానికి రాష్ట్రప్రభుత్వం అనేక నిబంధనలు ప్రవేశపెట్టిందాన్నరు. విద్యాసంస్థలకు 100మీటర్ల దూరంలో, బహిరంగ ప్రదేశాల్లో పొగాకు వినియోగంపై నిషేధించబడిందని, ఈనియమాన్ని ఉల్లంఘించిన వారికి జరిమానా విదించబడుతుందని ఆయన అన్నారు. ఆరోగ్య శాఖలోని పొగాకు నియంత్రణ సెల్ సహకారంతో అనేక ప్రజా అవగాహన కార్యక్రమాలు ,శిక్షణా కార్యక్రమాలు ,పొగాకు నియంత్రణ చట్టం కార్యకలాపాలను నిర్వహించడం ద్వారా పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని నియంత్రించాలని, కఠినమైన చర్యలు తీసుకుందని జిల్లా పొగాకు నియంత్రణ సెల్ జిల్లా సర్వేయర్ ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మరియంబి అన్నారు. జరిమానా రూ.200 నుండి1000 రుపాయలు జరిమానా విధించాలని ప్రభుత్వ నియమాలను పాటిస్తూ బళ్లారి జిల్లాను పొగాకు రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ చేతులు కలపాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా జిల్లా క్షయ నిర్మూలన అధికారిణి డా.ఇంద్రాణి, డా.జబీన్‌తాజ్, డా.శ్రావణి, అధికారులు రాఘవేంద్ర,



గోవిందప్ప, అంబాదాస్, శివకుమార్, తిప్పేసామి, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, ఖాసీం, ఉమా మహేశ్వరి, సవిత, శరత్‌బాబు, కాంతమ్మ, నవీన్, కుటుంబ సంక్షేమ శాఖ సిబ్బంది, జిల్లా సర్వేయర్, మానసిక ఆరోగ్య కార్యక్రమ సిబ్బంది, జిల్లాపొగాకు నియంత్రణ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రామా కేర్ హాస్పిటల్‌లో..

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినంలో భాగంగా నగరంలోని ట్రామా కేర్ ఆసుపత్రి ఆవరణలో పొగాకు ఉత్పత్తులను ఉపయోగించడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో శనివారం అవగాహన కల్పించారు. నెలపాటు ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ ,ఇన్‌పేషెంట్ విభాగాల నుంచి పొగాకు ఉత్పత్తులను సేకరిస్తున్నారు. ఈసందర్భంగా ట్రామా వేర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్, ఆసుపత్రి సిబ్బంది,ఇతరులు పాల్గొన్నారు.

సీఈటీలో సత్తాచాటిన ఎంవీ కళాశాల విద్యార్థులు



అభిషేక్ | బనపూర్ | అదితి ప్రదీప్ | అక్షిత్ రాథోడ్ | అదితి అంగడి | అలియా పరీన్ | చందన్ | అమోల్

బళ్లారి సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన సీఈటీ పరీక్షల్లో విద్యార్థుల ర్యాకుల పంట పండించారు. దావణగెరలోని సర్ ఎంవీ కళాశాల విద్యార్థులు యోగేశ్వర ఇంజినీరింగ్‌లో 101, యూనానిలో 130,వ్యవసాయంలో 17, పశువైద్యం 30, ప్రకృతి వైద్యంలో 53వర్యాంకులు సాధించి టాపర్‌గా నిలిచాడు. ఇంజనీరింగ్‌లో విజయ్‌కోరి 136, రాఘవేంద్ర 176, అక్షిత్‌రాథోడ్ 225, అన్మూల్ శాన్వాడ్ 240, నందన్ 275, రాహుల్ మరద్ 369, సృష్టి 401, అదితి, వీరేశ్ అంగడి 476,హర్షిణి 501,జయలక్ష్మి 574,అభిషేక్ బాణపూర్ 583, అలియా ఫరీన్ 628, అభిషేక్ 679, అదితి ప్రదీప్ 688, చందన్‌శశిధర్ సుధాకర్ 692, ఆర్య కే.భట్ 748, శిరీష్ 753, బాలాజీ తేజస్ 754, జయదేవ కణకుప్పి 761, స్పందన 787, వృషబ్ పాటీల్ 827,అఖిల్ అన్వేరి 885, పృథ్వి 898, అనన్య 904, గురురాజ 919, విజయ్‌కుమార్ పోలీస్ పాటిల్926, నూతన 946, ఆయుష్ భట్ 952, ప్రథమ్ గడియార 948, విశాల్ 988వ ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రదానాచార్యుడు తెలిపారు. వ్యవసాయంలో రాఘవేంద్ర 20, రాహుల్ మరద్ 49,హర్షిణి 83, అధతి వీరేశ్ అంగడి 89, అలియ షరీఫ్ 92వ ర్యాంకు సాధించారు. ప్రకృతి వైద్యంలో-రాహుల్ మరద్ 20, అదితి వీరేశ్ అంగడి 28, అభిషేక్ 52, అలియ ఫరీన్ 59, రక్షా 69, రాఘవేంద్ర 71, గురురాజ 82, ప్రజ్వల్ 85, అథితి ప్రదీప్ 68, రక్షా 71, అలియాఫరీన్ 93, జీవన్ 98వ ర్యాంకులతో మెరిశారు. విద్యార్థులను కళాశాల ర్యాంకులతో మెరిశాయి. విద్యార్థులను కళాశాల చైర్మన్, సభ్యులు అభినందించారు.



జయలక్ష్మి | అర్షిణి | నందన్ | నలవగి యోగీశ్ | రాహుల్ | శృతి | రాఘవేంద్ర | వినయ్‌కోరి

కేఎంఎఫ్ డైరెక్టర్ల మధ్య గొడవ
● పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

బళ్లారి, మే 31(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) కార్యాలయంలోనే డైరెక్టర్లు దనుజయ హమల్, మరలు సిద్దప్ప మధ్య గొడవ జరిగింది. కేఎంఎస్ లో పనిచేస్తున్న ఉద్యోగులు విరమణ సన్మాన సభను శుక్రవారం నిర్వహించారు. కొప్పళ, విజయనగర, బళ్లారి, రాయచూరు జిల్లాలో కేఎంఎఫ్ లో పనిచేస్తున్న ఉద్యోగులకు బళ్లారిలో ఉన్న కేఎంఎఫ్ కార్యాలయంలో సన్మానసభ నిర్వహించారు. కార్యక్రమానికి డైరెక్టర్లు దనుంజయ, మరలు సిద్దప్ప హాజరయ్యారు. హగరిబొమ్మణహాల్ నుంచి పాలలో నీలు కలిపి కల్తీ పాలు వస్తున్నాయని కొందరు ఆరోపించారు దీంతో డైరెక్టర్ ధనుంజయ ఇది ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమమని, వివాదాస్పద వ్యాఖ్యలు తగవన్నారు. మరుల సిద్దప్ప మాత్రం తన వివాద వ్యాఖ్యలు కొనసాగిస్తుండంతో ధనుంజయ అతని పై గొడవకు దిగారు. తీవ్ర వాగ్వాదం జరిగి ఒకరి పై ఒకరు చేయిచేసుకున్నారు. పోలీసులు రంగప్రవేశం చేశారు. ఇద్దరినీ చెదరగొట్టి పంపించారు. పోలీస్ స్టేషన్లో రాజీ కుదిర్చి పంపేశారు.



సంతకాల సేకరణలో మాట్లాడుతున్న ఏఐడీఎస్ఎస్ఓ సభ్యురాలు శాంతి

పాఠశాలల మూసివేత తగదు: ఏఐడీఎస్ఓ

బళ్లారి సిటీ,మే 31(ఆంధ్రజ్యోతి): తక్కువ విద్యార్థుల సంఖ్యను సాకుగా చూపి విలీనం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 6వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని, ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నగరంలోని పెద్ద మార్కెట్ సమీపంలో ఏఐడీఎస్ఎస్ఓ శనివారం సంతకాల సేకరణ ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలు కూలీ కార్మికులు, పేదల జీవితాలకు వెలుగు నిచ్చాయని ఏఐడీఎస్ఎస్ఓ ఉపాధ్యక్షుడు ఎం. శాంతి అన్నారు. 10 మంది కంటే తక్కువ మంది పిల్లలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలన్న ప్రభుత్వ చర్య సరైనది కాదన్నారు. పలు పాఠశాలలు శిథిలావస్థకు చేరుకోవడంతో తల్లిదండ్రులు పిల్లలను పంపడానికి జంకుతున్నారన్నారు. మరమ్మతులు చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈసందర్భంగా సంస్థ అధ్యక్షుడు కే.ఈరన్న, ఉపాధ్యక్షురాలు ఉమ, ఆఫీస్ బేరర్లు కంబలి మంజునాథ్ పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

● డీసీ కార్యాలయం ముందు ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల ఉద్యోగులు

బళ్లారి సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రెసిడెన్షియల్ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని, పలు సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగులు నిరసన చేపట్టారు. శనివారం ఉద్యోగులు డీసీ కార్యాలయం ముందు నిరసన తెలిపి తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాకు రాష్ట్రంలో 6,400 కంటే ఎక్కువ మంది శాశ్వత సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్డ్ కులాలు,షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతుల నివాస పాఠశాలల నిర్వహణ కోసం కర్ణాటక నివాస విద్యా డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సాంఘికసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కర్ణాటక రెసిడెడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ అసోసియేషన్ కింద రాష్ట్రవ్యాప్తంగా 823 రెసిడెన్షియల్ పాఠశాలలు/కళాశాలలు పనిచేస్తున్నాయి. వీటిలో 2లక్షలకు పైగా విద్యార్థులు ఉచితంగా రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రతి సంవత్సరం పదవతరగతి వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలను సాధిస్తున్నాయి. కేబీఎస్ఎస్‌పి భవన నిర్మాణ పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున విద్యా కార్యకలాపాలు మందగించాయన్నారు. ఇంటి అద్దె భత్యాన్ని మినహాయింపు నుంచి మినహాయించాలని అభ్యర్థించారు. 10శాతం ప్రత్యేక భత్యం ఇవ్వాలని కోరారు. మొరార్జీ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు




దుర్గన్న దంపతులను సన్మానిస్తున్న పురసభ సిబ్బంది

కంప్లి, మే 31(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతోనే ప్రభుత్వ ఉద్యోగులు గుర్తింపు సాధిస్తారని పురసభ అధ్యక్షుడు బట్ట ప్రసాద్ అన్నారు. శనివారం పురసభ ముఖ్య అధికారి దుర్గన్న పదవీ విరమణ సందర్భంగా ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దుర్గన్న మాట్లాడుతూ తమకు ప్రజాప్రతినిధులతో సిబ్బంది తోడుంటూ 23 వార్డుల్లో అభివృద్ధికి ఎంతో సహకారం అందించారన్నారు. బళ్లారి హొస్పేట, కురుగోడు, సిరుగుప్ప, లింగసూగూరు తదితర పట్టణాల్లో విధులు నిర్వహించామని, సహకరించిన అధికారులను మరువలేనన్నారు. అనంతరం సిబ్బంది ప్రజాప్రతినిధులు పట్టణ సంఘ సంస్థ నేతలు ఆయన్ని అభినందించి సన్మానించారు.

సిరుగుప్ప: వ్యవసాయ అసిస్టెంట్ అధికారి హేమ్లానాయక్ సేవలు అమోఘమని సిరుగుప్ప తాలుకా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌పీ పాటిల్ అభిప్రాయం వ్యక్తం చేశారు. టెక్కలకోట పట్టణంలో వ్యవసాయ అధికారిగా సేవలు చేసిన హేమ్లానాయక్ పదవీ విరమణ సందర్భంగా పట్టణ వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయనకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాల డీలర్ల సంఘం అధ్యక్షులు తిరుమలశెట్టి, వీరణ్ణ, తదితరులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారులు బాలాజీ నాయక్, పురుషోత్తమ్, రైతులు ఉలిగయ్య, నాగన్నగౌడ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పూలమాలలతో స్వాగతం

బళ్లారి గాంధీనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): విద్య ప్రాధాన్యం, ప్రాముఖ్యతను చిన్నారులు, తల్లి తండ్రులకు చాటిచెప్పి విద్యార్థులకు పూలహారాలు వేసి స్వాగతం పలికారు ఆ ఉపాధ్యాయులు. శుక్రవారం దావణగెర జిల్లా కడరనాయకన హళ్ళి సమీపంలోని కొక్కనూరు



విద్యార్థులను తీసుకొస్తున్న ఉపాధ్యాయులు

ఏకేసీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సిబ్బంది పూలహారాలు వేసి విద్యార్థులను పాఠశాలకు తీసుకురావడం గ్రామంలో అందరినీ ఆశ్చర్య పరిచింది. ఈ నెల 29వ తేదీ నుంచి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం అయ్యాయి. అయితే పాఠశాల ప్రారంభమై రెండు రోజులు గడుస్తున్నా... పాఠశాలకు వచ్చే విద్యార్థుల హాజరుశాతం తక్కువ కావడంతో పాఠశాల ఉపాధ్యాయులే ఏకంగా విద్యార్థుల ఇళ్ళవద్దకు వెళ్ళి 'తమ పిల్లలను పాఠశాలకు పంపండి' అని గ్రామాల్లో తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ముఖ్యోపాధ్యాయులు హెచ్.మరుళసిద్దప్ప, ఉపాధ్యాయులు కమలాకర, గీతా, మీనాక్షి, ప్రేమ, మమతలు ఉన్నారు.

చిన్నారులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

కంప్లి, మే 31(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో శనివారం ప్రజానాయకుడు రాజశేఖర్ పుట్టిన రోజు సందర్భంగా అంగన్‌వాడీ పాఠశాలల్లో చిన్నారులకు పుస్తకాలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ పంచాయతీ ఉపాధ్యక్షుడు కనికేర పంపాపతి, కౌన్సిలర్ వెంకటరమణ బాబు మాట్లాడుతూ రాజశేఖర్ మరిన్ని పుట్టినరోజులు జరుపుకుని ప్రజల సేవలు చేపడుతూ మరిన్ని గుర్తింపు పొంది మరిన్ని హోదా పొందాలని కోరారు. కార్యక్రమంలో అభిమానులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు పుస్తకాలు, స్వీట్లు అందజేస్తున్న రాజశేఖర్ అభిమానులు

ఆయుర్వేద ఆస్పత్రిని సద్వినియోగం చేసుకోండి

● ఎమ్మెల్యే జేఎన్ గణేష్

కంప్లి, మే 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు ప్రభుత్వాస్పత్రి సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని గణేష్ తెలిపారు. శనివారం కురుగోడు తాలుకా పరిధిలోని కోళూరు గ్రామంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ ఆయుర్వేద క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాల్లడుతూ ఎటువంటి దుష్ప్రభావాలు లేని ఆయుర్వేద వైద్యశాలల సేవలను ప్రజలు సద్వినియోగం చేసు కోవాలన్నారు. ఇక్కడ అన్నిసేవలు ఉచితంగా లభిస్తా యన్నారు. కార్యక్రమంలో కోళూరు గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు దొడ్డబసమ్మ, ఉపాధ్యక్షులు చెన్నప్ప, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ విరుపాక్ష, క్లినిక్ వైద్యాధికారి డాక్టర్ కళ్యాణి, కోళూరు గ్రామ పంచాయతీ సభ్యులందరూ గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులుసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి

బళ్లారి సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని కురుబ సంఘం కార్యాలయంలో శనివారం వీరనారీ అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా కురుబ సంఘం అధ్యక్షుడు గాదిలింగనగౌడ అహల్యాబాయి బ్రిటీష్ వారిపై కురుబ మహిళలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ప్రతి స్త్రీ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రధాన కార్యదర్శి కే.మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అంజినప్ప, న్యాయవాదులు జోగిన చంద్రప్ప,బిసళహళ్ళి కట్టెప్ప తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం (హోస్పేట), మే 31(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి పర్యాటక, ఆతిథ్య రంగంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పర్యాటక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రభులింగ తలకేరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 2వ తేదీ నుంచి కమలాపూర్ లోటస్ మహల్ సమీపంలోని పర్యాటక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం నుండి దరఖాస్తు ఫారమ్‌ను పొంది జూన్ 9వ తేదీలోపే అదే కార్యాలయంలో సమర్పించాలన్నారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థి వయసు కనీసం 20 నుండి 45 యేళ్ల మధ్య వుండాలి. ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్, స్టీవార్డ్, మల్టికుజిన్ కుక్, రూమ్ అటెండెంట్, తదితర శిక్షణలకు వివిధ నెలల్లో పూర్తి అవుతుందన్నారు. కావున శిక్షణ పొందాలనుకునే వారు 08394 295640కు సంప్రదించవచ్చని తెలిపారు.

4న స్కూళ్లలో ప్రవేశానికి కౌన్సెలింగ్

విజయనగరం (హోస్పేట), మే 31(ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఫర్ మైనార్టీస్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి పోటీపరీక్ష నిర్వహించారు. ఫలితాలు ఇప్పటికే వెబ్‌సైట్‌లో, పాఠశాలల్లో ప్రచురించబడ్డాయి. కౌన్సిలింగ్ కోసం జూన్ 4, 5వ తేదీలలో ఉదయం 10 గంటలకు అబ్దుల్ కలామ్ రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ మైనార్టీస్, జంబునాథహళ్లి, హోస్పేట ఎంపిక జాబితాలో విద్యార్థులు కౌన్సిలింగ్‌లో పాల్గొని తమ అడ్మిషన్ సీటును ఎంచుకోవాలని అధికారులు కోరారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు అవసరమైన పత్రాలను తమ వెంటనే తీసుకురావాలన్నారు. ఐదు ఫొటోలు అడ్మిషనల్ లెటర్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ప్రత్యేక కోటా కింద ఎంపిక ధృవీకరణ పత్రం, 5వ తరగతి మార్క్‌షీట్ అన్ని పత్రాలను నకిలీలు తీసుకుని రావాలన్నారు.

హోసూరు జోన్

సరిహద్దులో కన్నడ సంఘాల నిరసన

హోసూరు, మే31(ఆంధ్రజ్యోతి): నటుడు కమల్‌హాసన్ వ్యాఖ్యలపై కన్నడసంఘాలు నిరసన కొనసాగిస్తున్నాయి. సరిహద్దులోని అత్తిబెలెలో కన్నడ జాగృతి వేదిక ఆధ్వర్యంలో కమల్‌హాసన్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. మంజునాథ్ దేవా ఆధ్వర్యంలో నిరసన సాగింది. కమల్ ఫోటోలకు మసిబూశారు. కన్నడ భాషకు వేలసంవత్సరాల చరిత్ర ఉందని, భాష పట్ల ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు సహించబోమన్నారు. సీనియర్ నటుడు అయినంత మాత్రాన భాషపట్ల కనీస అవగాహన లేకుంటే ఎలాగన్నారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని డి మాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న కన్నడసంఘాల నాయకులు

ఉత్సాహంగా ఎద్దుల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న గ్రామపెద్దలు



పోటీలు జరుగుతున్న దృశ్యం

హోసూరు, మే 31(ఆంధ్రజ్యోతి): కుమ్మనూరు గ్రామంలో ఎద్దుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. తక్కువ సమయంలో 120 మీటర్లు అధిగమించిన ఎద్దు యజమానికి బహుమతులు అందచేశారు. తొలిబహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.75వేలు, మూడో బహుమతిగా రూ.60వేలు, నాల్గో బహుమతిగా రూ.50వేలు ప్రదానం చేశారు. వేలాదిమంది ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎద్దులను తడుముతూ యువకులు భాగస్వామ్యులయ్యారు. ఏర్పాట్లను పంచాయతీ మాజీ అధ్యక్షుడు కృష్ణన్ పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న చంద్రయాన్ నమూనా



చంద్రయాన్ నమూనాతో విద్యార్థులు

హోసూరు, మే 31(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జ్ఞాపకార్థం కృష్ణగిరి ప్రభుత్వ సాంకేతిక కళాశాల పూర్వ విద్యార్థులు చంద్రయాన్3 రాకెట్ నమూనాను రూపొందించారు. దీన్ని ప్రజల సందర్శనకు అవకాశం కల్పించారు. 15 అడుగుల పొడవైన చంద్రయాన్ రాకెట్ నమూనా సందర్శకులను ఆకట్టుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ శారద అధ్యక్షత వహించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి షణ్ముగప్రియ, సీఎం వ్యక్తిగత సహాయకుడు వెంకటేశన్ తదితరులు సందర్శించారు. కళాశాల కంప్యూటర్ విభాగాధిపతి భువనేశ్వరి తదితర అధికారులు సందర్శించారు.